# గురుశాసనం

స్కోరు 'డ్యూస్' అయింది.

'సింగ్...సింగ్.....విన్' చప్పట్లు లయబద్ధంగా కొడ్తూ ప్రేక్షకులు సింగ్‌కు హుషారిచ్చారు.

సింగ్ సర్వ్ చేయటానికి బాల్‌ని చేతిలోకి తీసుకొన్నాడు.

బాల్‌ను రిసీవ్ చేసుకోటానికి పట్టాభి నడుంవంచి అటూయిటూ వూవుతూ రెడీగా వున్నాడు.

టెన్నిస్‌లో 'రైజింగ్‌స్టార్' సింగ్. కనుక టైటిల్ ఫేవరేట్. యీ పోటీల్లో సీడెడ్ నెంబర్ వన్. అతని ఆటను ఫైనల్‌దాకా చూడాలన్న కోరికతోనే జనం విరగబడి టిక్కెట్లు కొన్నారు.

రెండు రౌండ్స్ సునాయాసంగా గెలిచాడు సింగ్. మూడోరౌండ్ కూడా యీజీగా గెలిచేస్తాడనుకొన్నారంతా.

కానీ అందరి అంచనాలు తలకిందులయ్యాయి.

పట్టాభి వర్సగా రెండుసెట్స్‌ని గెలవటాన్ని ఎవరూ నమ్మలేకపోతున్నారు. మూడోసెట్‌లో అయిదూ మూడూ ఆధిక్యతతో వున్నాడు పట్టాభి. యీ గేమ్ గెలిస్తే ఆరూ మూడూ స్కోర్‌తో పట్టాభి సెట్‌ను, మేచ్‌ని కూడా గెలిచినట్లే. ఎవరూ వూహించని "అప్‌సెట్" అవుతుందది.

"ఏస్" ఎవరో అరిచారు.

"సైలెన్స్ ప్లీజ్. థాంక్యూ" రెఫరీ పొలైట్‌గా హెచ్చరించాడు.

సింగ్ సర్వ్ చేసేడు. ఫాల్ట్!

మళ్లీ సర్వ్ చేసేడు. డబుల్ ఫాల్ట్!

అడ్వాన్‌టేజ్ టు పట్టాభి.

ఆ దశలో సింగ్‌లాంటి ఆటగాడు డబుల్ ఫాల్ట్ చేయటం...ప్రేక్షకుల ఉత్సాహంపై, చల్లటినీళ్లు చిలకరించినట్లయింది.

పట్టాభికి మాత్రం ప్రేక్షకుల ఫీలింగ్స్ పట్టలేదు.

తనకీ విజయానికి మధ్య ఒకేవొక్కపాయింట్!

ఆ భావనవల్ల అతని మనసుకు థ్రిల్! ఏదో శక్తి నరనరాల్లోకి ప్రవేశించినట్లయింది.

జీవితంలో, కనీసం, ఒకేవొక్కసారైనా ఏదైనా ఒకటైటిల్‌ని సాధించాలన్నది పట్టాభి చిరకాలవాంఛ.

అతనికి డబ్బుంది. చదువుంది. పెద్ద ఉద్యోగం వుంది. అందమైన భార్య వుంది. బంగారంలాంటి

బిడ్డలున్నారు. అయినా అతనికి తృప్తి లేదు.

టెన్నిస్ చిన్నప్పటి నుంచి అతనికి ఆరో ప్రాణం.

ఆ ఆటచరిత్ర....రికార్డులు....ఫేమస్ ప్లేయర్స్ పేర్లు.....యివన్నీ అతనికి కంఠోపాఠం. టెక్నిక్స్ గురించి ఉపన్యాసాలివ్వగలడు. అయినా ఆటలో మాత్రం అతను రాణించలేకపోయాడు. అలాంటిది యీ పోటీల్లో రెండు రౌండ్స్‌లో గెలుపొంది మూడో రౌండ్‌లోకి ప్రవేశించాడు. అది 'ఫ్లూక్' అన్నారంతా.

మూడో రౌండ్‌లో సింగ్‌పైన గెలుస్తానని అతను కూడా ఎప్పుడూ అనుకోలేదు. కానీ ఆ రోజు సింగ్ చప్పగా ఆడుతున్నాడు.

ప్రత్యర్థి బలహీనతలే ఏ ఆటగాడికైనా బలం.

సింగ్ మీద గెలవటం.....ఓహ్!

అతనిలో కాన్ఫిడెన్స్ పెరిగింది. త్రివిక్రముడయ్యాడు.

సింగ్ బలంగా సర్వ్ చేసేడు.

అయితే బల్లి పొంచివుండి పురుగును అమాంతం మింగేసినట్లుగా, పట్టాభి ఆ సర్వీస్‌బాల్‌ని రిటర్న్‌షాట్ కొట్టాడు.

అంత వరకు ఎన్నిపాయింట్లు గెలిచినా చప్పట్లు కొట్టని ప్రేక్షకులు ఆ షాట్‌కు చప్పట్లు కొట్టేరు.

ఆనందంతో పట్టాభి రేకెట్‌ని గాల్లోకి విసిరేసి, చిన్నపిల్లాడిలా కోర్ట్‌లో గంతులేసేడు.

★ ★ ★

"నర్సింహులూ, యిలారారా"

"యస్సార్" అంటూ నర్సింహులు పట్టాభి దగ్గరికి పరిగెత్తేడు.

నర్సింహులు ఆ క్లబ్‌లో బాల్‌బాయ్.

తన తల్లెవరో, తండ్రెవరో నర్సింహులుకు తెలీదు.

నాలుగేళ్ల వయసు వచ్చే వరకూ అతడిని ఒక ముసలమ్మ పెంచింది. ఆమె పేరు కాసులమ్మ.

కాసులమ్మ వృత్తి అన్నాన్ని అమ్మటం....ఆమె ముష్టి వాళ్ళ దగ్గరి నుంచి అన్నాన్ని కొంటుంది. రిక్షావాళ్లకు అమ్ముతుంది. ఆ లాభమే ఆమె జీవనాధారం.

ప్లేట్లు, గ్లాసులు కడుగుతూ, అమెకు సాయంగా వుండేవాడు నర్సింహులు. కాసులమ్మ అతడిని ప్రేమగానే చూచుకొనేది. అయినా నర్సింహులుకు ఆమె వృత్తి అంటే యిష్టం ఏర్పడలేదు.

అన్నాన్ని అమ్మటానికి వచ్చిన ముష్టివాళ్లు అతనితో పరాచకాలాడే వారు.

"ఒరేయ్ నర్సింహా. నువ్వు మా వృత్తికి పనికిరావురా. నిన్ను చూస్తే ఎవరికైనా ముద్దు పెట్టుకోవాలనిపిస్తుందికానీ, జాలిపడి యింత ముద్దవేయాలనిపించదు."

అన్నాన్ని తినటానికి వచ్చిన రిక్షావాళ్లు, జేబులుకొట్టే వాళ్లు, బజారు వేశ్యలు కూడా అతనితో సర్దాగా మాట్లాడేవారు.

"పిక్‌పాకెటింగ్ టెక్నిక్కులు నేర్పుతాను. నాతోవస్తావేరా? ఎంతటి పోలీసోడు కూడా నువ్వు జేబులు కొడ్తావంటే నమ్మడు. నీమొహంలో మహారాజ కళవుందిరా. జేబులు కొడస్తా మహామంత్రివవుతావేమో.....ఎవరుచూచొచ్చారు?"

"ఒరేయ్ నర్సింహాయ్. నిన్ను వుంచుకొంటాను. నాకేమిస్తావురా?"

నర్సింహులు అందంగా వుంటాడు. అందుకే అతనంటే అందరికీ యిష్టం.

కానీ అతనికి వాళ్లమాటలు, చేసేపనులు అసహ్యంగా కన్పించేవి.

అడుక్కోటం, దొంగిలించటం, వొళ్లు అమ్ముకోటం.......ఛీ....ఏం బ్రతుకులివి?

అతని దృష్టి వాళ్లమీద వుండేదికాదు.

ఆ సెంటర్‌కి అల్లంత దూరంలో ఒక క్లబ్ వుంది.

ఆ క్లబ్‌కి తెల్లటి నిక్కరు, బనీను వేసుకొని, చేతిలో బేట్ పట్టుకొని, కాళ్లకు వైట్‌షూలు వేసుకొని కొందరు టింగ్‌రంగాగా వెళ్తుండేవారు.

నర్సింహులు దృష్టి ఎప్పుడూ వారిమీద వుండేది.

ఆ బేట్‌తో వారేం చేస్తారో?

అతనొకరోజు ఎవరూ చూడకుండా ఆ క్లబ్ లోపలికి వెళ్లి వాళ్లేం చేస్తుంటారో చూశాడు.

ఆ ఆట అతడిని ఆకర్షించింది.

అతని నాలుగోఏట కాసులమ్మ హఠాత్తుగా మరణించింది. ఆ విషయం తెల్సి యిరుగుపొరుగువారు వచ్చి ఎవరిచేతికి చిక్కింది వారు తీసుకుపోయారు.

నర్సింహులును గురించి పట్టించుకోలేదెవరూ.

అతనికి భయం వేసింది. కాసులమ్మ శరీరాన్ని చూస్తూ అక్కడ వుండలేక పోయాడు.

ఎక్కడికి పోవాలో మొదట్లో తోచలేదు.

చివరికి క్లబ్ గుర్తుకొచ్చింది. అక్కడికెళ్లి వరండాలో కూర్చొని ఏడ్చాడు. ఏడ్చి ఏడ్చి ఎప్పుడో నిద్రపోయాడు.

"నర్సింహులూ, యీ బేట్ తీసుకోరా".

"అయ్యగారూ!" అంటూ ఏమో గొణిగేడు నర్సింహులు.

"తీసుకోరా అంటుంటే. యివాళ నుంచి నేను ప్రేక్టీస్ చేసుకోటానికి నువ్వు బాల్స్ వేస్తావు. కోర్టులో కాదు. కోర్టు బయట. నువ్వు ఎప్పటికీ బాల్ బాయ్‌వే. అది మాత్రం గుర్తుంచుకో."

★ ★ ★

లాఠీ దెబ్బ తగలటంతో ఉలిక్కిపడి లేచాడు నర్సింహులు. ఎండ మొహం మీద పడ్తోంది. కడుపు ఆకలితో కరకరలాడుతోంది.

"ఎవడ్రా నువ్వు? యిక్కడ పడుకొన్నావ్? వెళ్లు వెళ్లు...."

వాచ్‌మేన్ బెదిరించినా నర్సింహులు కదల్లేదు.

"లక్ష్మయ్యా. ఎవరది?" అప్పుడే కారు దిగి వస్తున్న క్లబ్ సెక్రటరీ అడిగేడు.

ఆయన్ని చూడగానే నర్సింహులు దేవుడిని చూచినంతగా ఆనందపడ్డాడు. ఆయన్ని కారులో వెళ్తుండగా అంతకు ముందు అతడు చాలా సార్లు చూచాడు.

"సార్. నాకెవరూ దిక్కు లేరు సార్. మా అవ్వ చచ్చిపోయింది. యిక్కడ వుండనివ్వండి సార్. మీరేం చెప్తే అది చేస్తాను", కాళ్లకు చుట్టుకుపోయి ఏడుస్తూ అన్నాడు.

సెక్రటరీ అతడివైపు వో క్షణం చూచాడు.

కుర్రాడు అందంగా ముద్దొస్తూ వున్నాడు. అతని కళ్లల్లో తెలివితేటల చిహ్నాలు వెలుగుతున్నాయి.

"ఏం పని చెయ్యగలవు నువ్వు?"

'సర్. ప్లేట్లు, చెంబులు గ్లాసులు శుభ్రంగా తోమగలను. ఇల్లు చిమ్మగలను. యింకా....యింకా....'

"ఊ? యింకా?"

"ఇంకా ఏపనులైనా చేయగలను సార్. మీరొక్కసారి చెప్తేచాలు, ఏదైనా నేర్చుకోగలను. నిజ్జంసార్. నన్నంతా అలా పొగుడుతుంటారు సార్"

"ఓకే....ఓకే.....అయితే నువ్వు యిక నుంచి యిక్కడే వుంటావు. నేను చెప్పిన పని చేస్తుంటావు'

అలా క్లబ్‌లోకి ప్రవేశించాడు నర్సింహులు.

కొన్నాళ్లు మెంబర్స్‌కు కాఫీలు తెచ్చిచ్చేడు. ఆ కాఫీకప్పుల్ని కడిగేడు. క్లబ్బంతా అవసరమైనపుడు నీట్‌గా తుడిచేవాడు.

సెక్రటరీ అతనాపనులు చేయటం చాలాసార్లు చూచాడు. ఎందుకో అతనికి అతడలాంటి పనులు చేస్తుంటే బాధగా వుండేది.

"నిన్ను బాల్‌బాయ్‌గా అప్పాయింట్ చేస్తున్నాను. యిక నుంచి నువ్వీపనులు చేయనక్కర్లేదు..."

బాల్‌బాయ్! బాల్‌బాయ్! అతను హిమాలయ పర్వతాన్ని ఎక్కినంతగా సంతోషపడ్డాడు.

అప్పటికే అతను క్లబ్‌కొచ్చే వ్యక్తుల మాటల్ని జాగ్రత్తగా వింటూ ప్రపంచాన్ని గురించి, టెన్నిస్‌ను గురించి కొంత నేర్చుకొన్నాడు.

బాల్‌బాయ్‌గా అతని కళ్ళెప్పుడూ బాల్‌పైనే వుండేవి.

ఎవరెవరు ఎలా సర్వీస్‌లు చేస్తారో, ఎలాంటి షాట్స్ కొడ్తారో గమనించేవాడు.

మిగతా బాల్ బాయ్స్ వారి డ్యూటీటైమ్ కాగానే వెళ్ళిపోయేవారు. ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అని ఎదురుచూసేవారు.

కానీ నర్సింహులికి కోర్టే జీవనసాధం.......... బాలే ఊపిరి.

ఆటలో, బేట్‌కి తగిలి ఆ బాల్‌చేసే శబ్దం మనసుకు మజానిచ్చే నిషా.

ఎప్పుడెవరు పిల్చినా బాల్ అందించటానికి అతను రెడీగా వుండేవాడు. మెంబర్స్ అందరికీ తలలో నాలుకలా వుండేవాడు.

నాలుగేళ్లు నాలుగు నిముషాల్లా గడిచి పోయాయతనికి.

మనిషి ఎదిగేడు. మనసుకూడా ఎదిగింది. బుద్ధి వికసించింది. అప్పుడతనికి ఒక కోరిక కలిగింది. ఆ కోరిక రోజురోజుకీ పెరిగి పెద్దది కాసాగింది.

☆ ☆ ☆

మొదటిసారిగా బేట్ పట్టుకొన్నాడు నర్సింహులు.

“సర్వీస్ చేయరా.... ” పట్టాభి అరిచాడు

నర్సింహులు, ఎన్నో రోజులుగా పెంచుకొన్న కోరికే అది!

తను నాలుగేళ్లుగా బాల్‌ని మాత్రమే పట్టుకుంటున్నాడు. ప్లేయర్స్‌కి ఇస్తున్నాడు.

కానీ వొక్కసారి బేట్‌ను కుడిచేత్తోపట్టుకొని, బాల్‌ను ఎడమచేతితో పైకి ఎగరేసి వారిలా కొడ్తే?

ఆ అవకాశం తనకి ఎప్పటికైనా వస్తుందా?

టెన్నిస్ ఆట పట్ల మక్కువతో పట్టాభి స్థాపించిన క్లబ్ అది. అతనే దానికి సెక్రటరీ.

పెద్దప్లేయర్‌గా అతనికి పేరు లేదుకాని క్లబ్ నిర్వాహకుడిగా అతనికి చాలా మంచి పేరుంది.

సెక్రటరీతో సహా క్లబ్ మెంబర్స్, ఉద్యోగులు అందరికీ కొన్ని ప్రవర్తనా నియమాలను అతను ముందే తయారుచేసేడు.

ఆ నియమాలను తను తప్పడు. యితరులు ఉల్లంఘిస్తే వూరుకోడు.

కోర్టు ఆవరణలో బాల్‌బాయ్ బేట్‌ను పట్టుకోకూడదన్నది అలాంటి నియమాల్లో ఒకటి.

“ఏరా? బేట్ పట్టుకోటం చాతకావటం లేదా? నేను చూపిస్తానుండు” పట్టాభి అతనిదగ్గరికొచ్చి బేట్ ఎలాపట్టుకోవాలో చెప్పి, అతనిచేత ఆ పొజిషన్‌లో బేట్‌ను పట్టుకొనేలా చేసేడు. బాల్‌ను స్వయంగా దగ్గరవుండి కొట్టించేడు.

“ఇదేపద్ధతిలో యిప్పుడు సర్వీస్ చెయ్.....?” అతను చేసిన మొదటి సర్వీస్‌ను చూచి నివ్వెరపోయాడు పట్టాభి!

☆ ☆ ☆

"కంగ్రాచ్యులేషన్స్ సర్. యు ప్లేడ్ వెరీ వెల్ టుడే"

డ్రస్సింగ్ రూమ్‌లో కొచ్చాక అభినందించిన సింగ్‌ని తేరిపారచూచాడు పట్టాభి.

సింగ్ అంతటి వాడిపైన విజయం సాధించిన అతడిని మేచ్ కాగానే అంతా అభినందించారు. అయితే ఎవరూ, 'నువ్వు బాగా ఆడేవు' అని అనలేదు. పై పెచ్చు సింగ్ అంత వీక్‌గా ఆడటానికి కారణాలేమిటని తర్కించుకోసాగేరు.

పత్రికా ప్రతిధులు, ఫొటోగ్రాఫర్స్ కూడా గెలిచిన అతడిని వదిలేసి, ఓడిపోయిన సింగ్‌ని చుట్టుముట్టేరు. ఫొటోలు తీసేరు. ప్రశ్నలేశారు.

"నిజం చెప్పు నర్సింహులూ.....సారీ సింగ్....నువ్వు యివాళ ఎందుకంత పూర్‌గా ఆడేవు?"

సింగ్ వెంటనే జవాబు చెప్పలేదు. తలవంచుకొన్నాడు.

ఆనాడు మొదటి సర్వీస్‌ను నర్సింహంనుంచి రిసీవ్ చేసుకొన్న రోజునే అతని ప్రతిభను గుర్తించాడు పట్టాభి.

ఎవరు నేర్పేరతనికి, యీ సర్వీసును? రెండేళ్ళలో మరింత ఎదిగేడు. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే పట్టాభి ఒక సమస్యను 'సాల్వ్' చేయాల్సి వచ్చింది.

ఆఫ్టరాల్ ఊరూపేరు లేని అనాథ కుర్రాడు నర్సింహులు.

బాల్‌బాయ్ నుంచి ప్లేయర్‌గా ఎదగటానికి సిద్ధంగా వున్నాడు. ఎదగనివ్వాలా? అతడిని అతనిసైజ్‌కు 'కట్' చేయాలా? మెంబర్స్‌లో చాలామంది అప్పటికే అతనిపట్ల యీర్ష్యను పెంచుకొన్నారు. అతడి ఎదుగుదలను సహించలేకపోతున్నారు.

"వాడిస్థాయి ఏమిటి? మనస్థాయి ఏమిటీ? అడ్డమైనవాళ్ళు ఆడే గేమ్ కాదిది. దిస్ యీజ్ ఎ రాయల్ గేమ్. కట్ హిమ్ ఆఫ్...."

"అసలు బాల్‌బాయ్ ఉద్యోగంలో నుంచి పీకేస్తే సరి"

బాగా ఆలోచించాడు పట్టాభి.

"నర్సింహులూ. బాల్‌బాయ్ ఉద్యోగం నుంచి నిన్ను తీసేస్తున్నాను."

"సర్....." రెండువందల యాభై కిలోమీటర్ల వేగంతో సర్వ్‌చేసిన బంతి మాడుకు తగిలినట్లయింది నర్సింహులుకు. దిమ్మెర పోయాడు.

"తప్పదు. కానీ నీకు అభ్యంతరం లేకపోతే మా ఇంట్లో సర్వెంట్ ఉద్యోగం ఇస్తాను."

సర్వెంట్ ఉద్యోగం అని పేరేకానీ అక్కడ నర్సింహులికి పనేలేదు. అప్పటికే ఆ యింట్లో చాలామంది సర్వెంట్స్ వున్నారు. ఇంట్లోనే వున్న టెన్నిస్ కోర్టులో కాస్సేపు అతనితో ప్రాక్టీస్ చేసేవాడు పట్టాభి.

"నీకు మరీ తోచకపోతే మా పిల్లలతో కోర్టులో కాస్సేపు టెన్నిస్ ఆడు".

కానీ పట్టాభి పిల్లలకి టెన్నిస్ అంటే గిట్టదు. వాళ్ళది క్రికెట్ పిచ్చి. ఎప్పుడూ టీవీముందు కూర్చుంటారు. వీడియో కేసెట్స్ వేసుకొని సినిమాలు, క్రికెట్ ఆటను చూస్తూ కుర్చుంటారు.

కుడితితొట్టిలో పడ్డ ఎలుకలా గిజగిజ తన్నుకోసాగేడు నర్సింహులు.

"నర్సింహులూ, యీ కాగితం మీద సంతకం పెట్టు, రేపటినుంచి నిన్ను మా క్లబ్ సభ్యుడుగా చేర్చుకుంటున్నా"

"సర్...... !!!"

"నీ బాధ నేనుగమనిస్తూనే వున్నాను. టెన్నిస్ ఆట ధనవంతుల సొత్తుకాదు. అభిరుచివున్న వాళ్లందరిగేమ్ అది. అలాగే ఈ క్లబ్ కూడా."

నిన్న మొన్నటిదాకా క్లబ్ బాయ్‌గావున్న అతనికి సభ్యత్వం యిచ్చి మెంబర్‌ని చేయటం చాలామందికి ఇష్టం లేకపోయింది. కొందరు సభ్యత్వానికి రాజీనామా చేసేరు. మరికొందరు అతనితో ఆడటానికి ముందుకు రాలేదు.

కానీ కొద్దిరోజుల్లోనే అతనితో ఆడటానికి 'మేమంటేమేమని' పోటీలుపడి ముందుకు రాకతప్పలేదు.

క్రమంగా అతడే క్లబ్‌లో నెంబర్ వన్ ఆటగాడయ్యాడు.

క్లబ్ తరపున పాల్గొన్న ఒకపోటీలో టైటిల్ గెలిచాడు.

ఆ ఫైనల్స్‌ని వొక మాజీ ఇండియా నెంబర్ వన్ ప్లేయర్ చూచాడు. అతనిప్పుడు కోచ్‌గా మారేడు.

"నర్సింహం కాదింక నీపేరు. సింగ్. నేను కోచింగ్ యిస్తాను నీకు. యూ విల్ బికమ్ ఎ వరల్డ్ క్లాస్ ప్లేయర్ సూన్."

అలా నర్సింహం పేరు మారింది. రూట్ మారింది.

ఆ తర్వాత అదృష్టాలు వొకదానివెంట వొకటి అతడిని వెతుక్కొంటూ వచ్చాయి. ఇండియాలో నెంబర్ వన్ అయ్యాడు.

"మాట్లాడవేం సింగ్? ఎందుకంత పూర్‌గా ఆడావు?"

"పూర్‌గా ఆడేనా? లేదు సార్. నేను మామూలుగానే ఆడేననుకొంటున్నాను. అయినా ఎప్పుడూ ఏ ప్లేయర్ కూడా ఒక్కలాగానే ఆడలేడు కదా సార్. ఈ సారి కోర్టులో మనిద్దరం తటస్థపడినప్పుడు మీమీద తప్పక గెలుస్తాను".

కానీ అందుకు ఎంతో కాలం ఎదురు చూడాల్సిన అవసరం లేకపోయింది.

ఏదో మేచ్‌లో పట్టాభి చేతిలో సింగ్ ఫస్ట్‌రౌండ్‌లోనే వోడిపోయాడు. అలా ఒక సారికాదు.... వర్సగా అయిదుసార్లు....

అంత గొప్ప ప్లేయర్, ఆఫ్టరాల్ పట్టాభిచేతిలో ఎందుకు ఓడిపోతున్నట్లు? టెన్నిస్ అభిమానులకు అది మిస్టరీగానే మిగిలింది.

★ ★ ★

"సుమిత్రా ప్లీజ్.... "

"ఏమిటండీ ప్లీజ్? యిలాంటి పిచ్చిపిచ్చి త్యాగాలు నాకు నచ్చవు. మీరసలు పడలేదు. మీ చెయ్యికి ఏంకాలేదు. దొంగకట్టు కట్టించుకొన్నారు. పోటీ నుంచి తప్పుకోటానికి యీ నాటకాన్ని ఆడుతున్నారు. నాకు మీ నాటకం నచ్చలేదు. నేను నిజాన్ని పత్రికలవారికి చెప్తాను."

"ప్లీజ్.... సుమిత్రా. నామాట విను. నీకు సింగ్‌ను గురించి పూర్తిగా తెలియదు'

"ఎందుకు తెలియదు? బాగా తెల్సు. అతనంటే నాకూయిష్టమేనండి. ఆ విషయం మీకూ తెల్సు. అతను పైకొస్తుంటే మీతోపాటు నేను కూడా సంతోషించాను. అయితే అతను గెలవటం కోసం మీరెందుకు పోటీ నుంచి రిటైర్ కావాలి? అసలు టెన్నిస్ ఆటనుంచే రిటైర్ అవుదామన్న నిర్ణయాన్ని ఎందుకు తీసుకోవాలి? మీరు టెన్నిస్ ఆడకుండా వొక్కక్షణం వుండలేరు కదా? ఎందుకిలాంటి నిర్ణయాలు తీసుకొంటున్నారు?....

"ఎందుకంటే.... ఎందుకంటే.... సింగ్ నాతో ఆడిగెలవలేడు. వరల్డ్ నెంబర్ వన్ పీట్ సంప్రాస్‌ను ఓడించవచ్చు అతను. గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్స్ అన్నీ గెలవవచ్చు. నాతో ఆడిమాత్రం గెలవలేడు. అందుకు."

"గొప్ప!"

"యిది నా గొప్పకాదు. అతని గొప్పబలహీనత. నీకు తెలీదు. నేను సింగ్‌ని యిటీవల కోర్టులో, వెలుపలాకూడా అబ్జర్వ్ చేసేను. సైకియాట్రిస్ట్‌లను కన్సల్ట్ చేసేను. అతనొక మధురమైన మానసిక జబ్బుతో బాధపడ్తున్నాడు"

"ఏమిటది?"

"కృతజ్ఞతాభావం!"

"కృతజ్ఞతాభావమా? అది మనుష్యులందరికీ వుండాలి కదా? అది జబ్బెలా అవుతుంది?"

"ఉండాలి. కానీ ఈనాడు ఆ కృతజ్ఞతా భావం మనిషిలో కరువవుతున్నది. మనిషి కాస్త ఎదగగానే అహంకారి అవుతున్నాడు. అన్నంపెట్టిన చేతిని తెగనరుకుతున్నాడు. కానీ, సింగ్ నిజమైన మనిషి అందుకే అతనిలో కృతజ్ఞతాభావం పుష్కలంగావుంది.."

"మంచిదేకదా?"

"మంచిదే. మామూలు మనుష్యులకయితే. కానీ టెన్నిస్‌లో అగ్రశ్రేణి ఆటగాడు కావాలంటే 'కిల్లర్ ఇన్‌స్టింక్ట్' వుండాలి. ప్రతిపాయింటుకూ రేకెట్‌తో యుద్ధం చేయాలి. వీడు తమ్ముడూ, వీడు మిత్రుడూ,

నీడు డబుల్స్‌లో నా పార్ట్‌నర్ అన్న భావనలు వుండకూడదు. కానీ సింగ్‌కునాపట్ల అలాంటి భావనలున్నాయి.'

"అంటే..."

"నీకు తెల్సు. నేను అతనికి ఏమేలు చేసినా, చిన్నపిల్లవాడని జాలిపడో, అతని టేలెంట్‌ని ప్రోత్సహిద్దామనో, నా అవసరం కొద్దో చేసేను. కానీ అతనికి నేనెప్పుడూ టెన్నిస్ ఆట నేర్పలేదు. అయినా నేను చేసిన సహాయాల్ని బట్టి నాలో అతను గురువును చూసుకొంటున్నాడు. ఆ విషయం అతనికి తెలియదు. మనసులో అతను గురువుగా నన్ను గౌరవిస్తున్నాడు. ఆరాధిస్తున్నాడు. ఆ గురు భావనే అతడు నాకు వ్యతిరేకంగా నిలబడినప్పుడు అతడిని నిర్వీర్యుడిని చేస్తోంది. నాకు విజయాలని సంపాదించి పెడ్తోంది."

సుమిత్ర మౌనంగా వింటోంది.

"సుమిత్రా. యిప్పుడు దేశానిక్కావల్సింది కృతజ్ఞతాభావన కలిగిన మనుష్యులు. గురుభక్తివున్న మనుష్యులే. కేవలం టెన్నిస్‌పట్ల వ్యామోహం వున్న నాలాంటి ఆటగాళ్లు కాదు. ప్రతిభవున్న సింగ్ లాంటి ఆటగాళ్లు. టెన్నిస్‌పట్ల నా వ్యామోహం, సింగ్‌లాంటి యువకుల కెరియర్‌కు అడ్డంగా నిలవకూడదు సుమిత్రా. అందుకే యీ నిర్ణయాన్ని తీసుకొన్నాను. తప్పా?"

సుమిత్ర భర్త చేతుల్ని పట్టుకొంది. అతని కళ్లల్లోకి ఆరాధనగా చూసింది.

"కాదండీ. మనిషిగా మీ ధర్మాన్ని నెరవేర్చుతున్నారు. ప్రొసీడ్...."

అప్పుడే చూశారిద్దరూ.

గుమ్మం వద్ద సింగ్ నిలబడి వున్నాడు.

అతనికంటివెంట నీరు.

సింగ్ దగ్గరికెళ్లి కన్నీళ్లు తుడవబోయాడు.

"తుడవకండి సర్. అవి శోకాశ్రువులు కావు. ఆనందాశ్రువులు. నాలోని నన్ను వెతికిపట్టుకొని, నాకోసం త్యాగాన్ని చేస్తున్న మహాపురుషులు మీరు. పరమ గురువులు'

"అవునా? అందుకే. నీనుంచి నేను గురుదక్షిణ కోరనా?"

"గురుదక్షిణా?"

"అవును. ఇప్పుడే నువ్వు విన్న మా సంభాషణను మర్చిపోవాలి. కనీసం నీగుండెల్లోనే వుంచుకోవాలి. మన ముగ్గురికి తప్ప ఈ విషయాలు మూడోవాడికి తెలియకూడదు."

"గురువుగారూ....."

"అవును. ఇది గురుశాసనం!!"

ఈనాడు ఆదివారం 24-9-1995